క్లుప్తంగా

గ్రీనరీ పనులను వేగవంతం చేయాలి



గన్నవరం:విమానాశ్రయం ఎదురుగా ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల వద్ద జాతీయ రహదారి పక్కన జరుగుతున్న గ్రీనరీ పనులను ఆదివారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పరిశీలించారు. గ్రీనరీ పనులపై సంబంధిత అధికారులతో చర్చించిన ఆయన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం యార్లగడ్డ మాట్లాడుతూ రామవరప్పాడు నుంచివిమానాశ్రయం వరకు 13 కిలోమీటర్ల పొడవునా రూ. 8 కోట్ల వ్యయంతో ఈ గ్రీనరీ పనులను చేపట్టినట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా జాతీయ రహదారిపై పచ్చదానాన్ని నింపి అత్యంత సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. విమానాశ్రయం నుంచి హనుమాన్ జంక్షన్ వరకు జాతీయ రహదారిపై గ్రీనరీ, బ్యూటిఫికేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్‌హెచ్‌పై హరిత వాతావరణం, శుభ్రమైన ప్రయాణ మార్గం ఉండే విధంగా అధికారులు నిరంతరం శ్రద్ధ వహించాలని సూచించారు.

వృద్ధాశ్రమానికి సరుకులు అందజేత



కేసరపల్లి(గన్నవరం): గ్రామంలోని అమ్మ వయో వృద్ధాశ్రమానికి ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ కార్యదర్శి రావి సురేష్‌బాబు రూ. 10 వేలు విలువైన నిత్యావసర సరుకులు, పాలు, గుడ్లు, కూరగాయలు, మందులు అందజేశారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేయడంతో పాటు రూ. 3 వేలు నగదును విరాళంగా అందజేశారు. వృద్ధులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం ప్రతిఒక్కరూ అదృష్టంగా భావించాలని తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి. కిరణ్‌కుమార్, కోశాధికారి కేఎస్ ఆర్‌కె. ప్రసాద్, డాక్టర్ లోయ సురేంద్ర, డాక్టర్ డి. సువర్ణబాబు, పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీనగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించండి



పెనమలూరు:తాడిగడప గ్రామంలోని శ్రీనగర్ కాలనీ కాలువ కట్ట వాసులు తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను కోరారు. గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు మాట్లాడుతూ డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని కోరారు. కొత్త పింఛన్‌లు మంజూరు చేయాలని, గ్యాస్ సొమ్ము జమ కాలేదని తెలిపారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చుతామన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, పలువులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించిన వైఎస్సార్ సీపీ నాయకులు



రామవరప్పాడు: గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌పై కూటమి ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసుల్లో అరెస్టు అయ్యి ఇటీవల బెయిల్‌పై విడుదలవ్వడంతో మండలంలోని ఎనికేపాడు వైఎస్సార్ సీపీ నాయకులు జంగారెడ్డి గూడెంలోని గుబ్బల మంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. వంశీమోహన్‌కు బెయిల్ మంజూరవ్వాలని, ఆరోగ్యం కుదుటపడాలని గుబ్బల మంగమ్మ తల్లికి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, నాయకులు కోనేరు సుబ్బారావు మాట్లాడుతూ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే వంశీమోహన్‌పై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని చెప్పారు. ఒక కేసులో బెయిల్ వస్తే మరో కేసు బనాయించి కూటమి నాయకులు రాక్షస ఆనందం పొందారని ధ్వజమెత్తారు. జైలు నుంచి బయటికి వచ్చాక కూడా కక్ష సాధింపు చర్యలు కొనసాగిస్తున్నారన్నారు. ఒక పక్క అనారోగ్యం, తీవ్ర జ్వరంతో బాధపడుతున్నా ఓ కేసు విచారణ నిమిత్తం పోలీసుస్టేషన్‌కు హాజరైన వంశీమోహన్‌ను మూడు గంటల పాటు నిరీక్షించేలా చేయడం దారుణమని చెప్పారు. వంశీ పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని, కేసుల నుంచి బయటపడాలని కోరుతూ పూజలు చేసినట్లు తెలిపారు.

కాల్వలు ఇలా.. సాగు నీటి సరఫరా ఎలా?

- అధ్వానంగా మారిన పంట కాల్వలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అవస్థలు పడుతున్న రైతులు

గన్నవరం రూరల్: పంటలకు సాగు నీరు సరఫరా చేసే కాలువలు తమ రూపాన్ని కోల్పోతున్నాయి. సాగు నీళ్లు సక్రమంగా అందితేనే పంటలు బాగా పండి రైతులు ఉపశమనం పొందుతారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లోని పంట కాల్వల పరిస్థితి దారుణంగా తయారైంది. కూటమి ప్రభుత్వం కాలువల ఆధునికీకరణపై కనీస దృష్టి పెట్టడం లేదు. దీంతో రైతులు నానా అవస్థలు ప డుతున్నారు. గన్నవరం మండలంలో 21 గ్రామాలుండగా, 17,500 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఉద్యాన పంటలు 3 వేల ఎకరాల్లో సాగులో ఉన్నాయి. ఇవిగాక కూరగాయలు, మామిడి తోటలు వేలాది ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా రహదారుల వెంట పెద్ద పంట కాలువలు ఉంటాయి. వాటి నిండా కంప చెట్లు పేరుకుపోయాయి. పొదలు మొలిచాయి. పంటకాల్వల వెడల్పు తగ్గిపోయాయి. అసలు ఆనవాళ్లే కోల్పోయాయి. ప్రతి సంవత్సరం గ్రామ గ్రామానా పంట కాల్వలు పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు ఆ సంగతి మరిచాయి. దీంతో ఆక్రమణలు పెరిగిపోయాయి. స్వరూపం కోల్పోయాయి. వ్యవసాయంలో కౌలు రైతులు పెరగటంతో యజమానులు పంటకాల్వల పర్యవేక్షణ పట్టించుకోవటం లేదు. దీంతో ప్రభుత్వ రెవెన్యూ కొలతల ప్రకారం ఉండాల్సిన పంట కాల్వలు రోజురోజుకు కుంచించుకుపోతున్నాయి. భూముల ధరలు పెరగటంతో అన్ని గ్రామాల్లోనూ రియల్ ఎస్టేట్ వెంచర్‌లు వెలిసాయి. ఈ దెబ్బకు పంట కాలువల్లో చిన్నపాటి తూములు వేసి వాటిని సైతం ఆక్రమించేశారు. వెంచర్ దారులకు రాజకీయ మద్దతు ఉండటంతో రైతులు మిన్నకుండిపోతున్నారు.



కంప చెట్లతో పూడుకుపోయిన ముస్తాబాద పెద చెరువు సాగునీటి మార్గం



తెంపల్లి రోడ్డులో ఆనవాళ్లు కోల్పోయిన పంట కాలువ



వీరపనేనిగూడెంలో రహదారిలో స్వరూపం కోల్పోయిన పంట కాలువ

ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా అభివృద్ధి చేయాలి..

ఏటా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పంట కాలువల తవ్వకాన్ని చేపడుతున్నారు. ఉపాధి కూలీలతో పంటకాలువలు తవ్వించాలని రైతులు కోరుతున్నారు. పంట కాలువలు తవ్వించి సాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలని విన్నవిస్తున్నారు. వేసవికి ముందే ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ఆలోచించాల్సి ఉండగా పట్టించుకోలేదు. దాంతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు. రైతులకు మేలు చేస్తున్నామంటున్న ప్రభుత్వం ప్రాథమికంగా దుస్థితిలో ఉన్న పంట కాలువలను గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.

పంట కాలువలు బాగుచేయాలి



గ్రామాల్లో పంట కాలువలు సర్వే చేయించి బాగు చేయించాలి. కాలువలు బాగుజేసి, వ్యవసాయానికి ఇబ్బందులు లేకుండా చూడాలి. వ్యర్థాలు పంట కాలువల్లో పడవేయకుండా అవగాహన కల్పించాలి. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.

–బెజవాడ తాతబ్బాయి, మండల సీపీఎం నాయకుడు

నీరందక రైతులకు ఇబ్బందులు



గ్రామాల్లో పంట కాలువలు సర్వే చేయించాలి. ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి. ప్రధాన కాలువలు బాగుచేయించి రైతులను ఆదుకోవాలి. సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

–అంగడాల సాంబశివరావు, రైతు, కొత్తగూడెం

కాలువల్లోనే వ్యర్థాలు....

సాగునీటి కాలువలను భద్రంగా ఉంచాల్సి ఉండగా వాటిని డంపింగ్ కోసం వినియోగిస్తున్నారు. దీంతో పంట కాలువలు, చెరువులు వ్యర్థాలకు నిలయంగా మారాయి. ఈ పరిస్థితి నివారించాల్సిన గ్రామ పంచాయతీలు చోద్యం చూస్తున్నాయి. ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. గ్రామాల్లో వ్యర్థాలను ఈ పంట కాలువల్లో డంప్ చేస్తున్నారు. గ్రామాల్లో డంపింగ్ యార్డులు లేని కారణంగా పంచాయతీలు వ్యర్థాలను తరలిస్తూ రోడ్ల వెంట పెద్ద పంట కాలువల్లో పార వేస్తున్నారు. శుభకార్యాలు జరిగినప్పుడు ఆ వ్యర్థాలను సైతం పంట కాలువల్లో రోడ్ల వెంట పడవేయటం ఆనవాయితీగా మారిపోయింది. ఈ మేరకు ప్రజల్లో అవగాహన పెంచాల్సిన ప్రభుత్వ శాఖలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. గ్రామగ్రామాన ఇదే దుస్థితి నెలకొని ఉంది.

కార్యకర్తలకు వెన్నుదన్నుగా వైఎస్సార్ సీపీ



కంకిపాడు: కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ వెన్నుదన్నుగా నిలుస్తుందని పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు చోడాబత్తిన వీరకుమారి భర్త సాంబశివరావు ఇటీవల మృతి చెందటంతో బాధిత కుటుంబానికి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి వితరణతో రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బేతపూడి సురేష్, మండల రైతు అధ్యక్షుడు భీమవరపు రాజగోపాల్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భీమవరపు నాగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ భీమవరపు గిరిరెడ్డి, నాయకులు జొన్నల కోటిరెడ్డి, మండల బూత్ కమిటీ అధ్యక్షులు యార్లగడ్డ సుందరయ్య, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సాయి నితీష్‌రెడ్డి, భీమవరపు లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఇళ్ల స్థలాల మంజూరు కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని గ్రామ పంచాయతీ కార్యదర్శి కోట సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సూచనల మేరకు స్థలాలు లేని పేదలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు పాస్‌పోర్టు సైజుఫొటో, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల జిరాక్స్‌లను జత చేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను సోమవారం ఉదయం నున్న గ్రామ పచాయతీ కార్యాలయం వద్ద అందచేయాలన్నారు.

ఒకే ఊళ్లో నాలుగు చోట్ల చోరీలు

ఉయ్యూరు రూరల్: మండలంలోని ఆకునూరు గ్రామంలో శనివారం రాత్రి నాలుగు చోట్ల చోరీలు జరగడం కలకలం రేపాయి. ఉయ్యూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకునూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గారపాటి కోటేశ్వరావు ఈ నెల 6వ తేదీన కాశీ యాత్రకు వెళ్లారు. తిరిగి 12 వ తేదీ ఉదయం తిరిగి వచ్చి చూడగా ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి ఉంది. బీరువా తాళాలు సైతం పగలగొట్టి ఉన్నాయి. రూ.700 చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సురేష్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి చోరీ జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఇంటి యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనికి తోడు అదే గ్రామంలో చోరీకి గురైన నివాసానికి దగ్గరలో ఉన్న మాజీ సర్పంచ్ కాకాని విజయ్ కుమార్ ఇంటితోపాటు రైతు భరోసా కేంద్రం, అక్కడికి దగ్గరలో ఉన్న ఓ ఆర్ఎంపీ వైద్యుని వైద్యశాలల తాళాలు దుండగులు పగలగొట్టారు. దీంతో వరుస నాలుగు చోట్ల చోరీలు జరిగినట్లుగా గుర్తించారు. వైద్యశాలలో 1200 రూపాయలు చోరీకి గురైనట్లు తెలిపారు. దీంతో ఒకే గ్రామంలో వరసగా ఒకేరోజు నాలుగు చోట్ల దొంగతనం జరగడంపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తాడిగడపలో రెండు కంపాక్టర్లు ప్రారంభం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో చెత్త తరలించటానికి రెండు కంపాక్టర్‌లను ఆదివారం ప్రారంభించారు. 42 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలిగిన రెండు కంపాక్టర్‌లను అందించగా స్వచాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మిరెడ్డి పట్టాభిరామ్, ఎమ్మెల్యే బోడెప్రసాద్ ప్రారంభించారు. ఈ కంపాక్టర్‌లు తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ప్రతీ రోజు 111 టన్నుల చెత్తను సేకరించి గంటూరులోని జిందాల్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తాయి. కార్యక్రమంలో కమిషనర్ షేక్.నజీర్, అసిస్టెంట్ కమిషనర్ డి.కిరణ్‌కుమార్, నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, వెలగపూడి శంకర్‌బాబు, దోనేపూడి రవికిరణ్, సంగెపు రంగారావు, పలువురు పాల్గొన్నారు.



కంపాక్టర్‌లను ప్రారంభిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఎమ్మెల్యే బోడెప్రసాద్

300 మందికి ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్:బాపులపాడు మండలం కోడూరుపాడులో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని ఆర్సీఎం పాఠశాల ప్రాంగణంలో వైస్ ఎంపీపీ చందు రమాదేవి, వైఎస్సార్ సీపీ నేత చందు శ్రీనివాసరావు దంపతులు ఏర్పాటు చేసిన ఈ మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నాసా మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించే సంకల్పంతో తరుచుగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న చందు శ్రీనివాసరావు, రమాదేవి దంపతుల కృషి అభినందనీయమని సాంబశివరావు చెప్పారు. శంకర గ్రూప్ ఇనిస్టిట్యూషన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు శిబిరంలో సేవలు అందించారు. దాదాపు 300 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. మరో 38 మందికి కంటి శస్త్రచికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించటంతో వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరావు, ఆంజనేయులు, అంబటి రంగారావు, నూకల బాలాజీ, ప్రసాద్, నాగు, వార్డు సభ్యుడు రమేష్ పాల్గొన్నారు.



మెగా వైద్య శిబిరంలో ఆధునిక యంత్రంతో కంటి పరీక్షలు చేస్తున్న నిపుణులు

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హనుమాన్‌జంక్షన్ రూరల్:విజయవాడరోడ్డులోని ఐసీఎం జూబ్లీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ ఆదివారం సందడిగా జరిగింది. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకుని అలనాటి స్నేహానుభూతులను పంచుకున్నారు. మూడు దశాబ్దాల తర్వాత 1993–94 బ్యాచ్ టెన్త్ క్లాస్ పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఏరా.. ఓరేయ్.. ఎలా ఉన్నాయ్.. ఏమి చేస్తున్నావ్ అంటూ చిన్ననాటి స్నేహితులను కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నారు.. ఏయే ఉద్యోగ, వ్యాపారాలు నిర్వహిస్తున్నారో, పిల్లలు ఏం చదువుతున్నారంటూ పరస్పరం తెలుసుకున్నారు. బాల్యంలోని మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. పాఠశాలలో చదువుకునేటప్పుడు చేసిన చిలిపి చేష్టలు, ఆకతాయి తగాదాలు, ఉపాధ్యాయులకు పెట్టిన మారు పేర్లు, తోటి స్నేహితులపై వేసిన జోకులు గుర్తుచేసుకున్నారు. రోజంతా బాల్యమిత్రులతో హుషారుగా, సంతోషంగా గడిపారు. తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసిన పాఠశాలను, ఉపాధ్యాయులకు జీవితాంతం రుణపడి ఉంటామని చెప్పారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు జీవానందం, జాన్‌మూడీ, వేద రత్నం, రామకృష్ణామూర్తి, శ్రీనివాసరావు, దాసులను దుశ్శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికలతో పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. తొలుత మృతి చెందిన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులను స్మరించుకుని, వారికి నివాళి అర్పించారు. పూర్వ విద్యార్థులు రాజశేఖర్, శ్రీనివాసరావు, మేడేపూడి వెంకటేశ్వరరావు, మల్లిశెట్టి సుబ్రహ్మణ్యం, ముప్పాళ్ల కిరణ్ కుమార్, జాస్తి రవికిషోర్, మంగళపాటి రవికుమార్, సునీల్ రాజ్‌కుమార్. వరప్రసాద్, మోహన్, శ్రీకాంత్, హీల్స్ బాబు సహా సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.



సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి హేయం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు:జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, బీసీ మహిళ ఉప్పాల హారిక పై టీడీపీ, జనసేన గూండాల దాడి హేయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి తెలిపారు. కానూరు పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జెడ్పీ చైర్ పర్సన్ హారిక ఆమె భర్త రాము శనివారం గుడివాడలో పార్టీ సమావేశానికి వచ్చిన సమయంలో టీడీపీ, జనసేన గూండాలు, గంజాయి బ్యాచ్ వారిని గంట సమయం కారులో నిర్బంధించి దారుణంగా దూషించారన్నారు. హారిక దంపతులను హత్య చేయాలని చూశారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్‌కు మహిళల పై కనీస గౌరవంలేదని తెలిపారు. బీజేపీ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈ ఘటన పై ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. బీసీలపట్ల టీడీపీ, జనసేన నేతలకు చులకనగా కనబడుతుందని పేర్కొన్నారు. కొనకళ్ల నారాయణ, మంత్రి కొల్లురవీంద్రల రాజకీయాలు హత్యా, రౌడీ రాజకీయాలుతో ముడిపడి ఉన్నాయని విమర్శించారు. మాజీ మంత్రి పేర్నినానిని ఎదుర్కోలేక కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రాష్ట్రంలోనే పెద్ద అవినీతి పరుడని ఆరోపించారు. బోడెప్రసాద్ రోజుకు రూ.10 లక్షలు సొమ్ము అక్రమార్జన చేస్తున్నాడని విమర్శించారు. తన ఆరోపణ నిజం కాకపోతే క్వారీలో ఇసుక రేటు ఎంతో బోర్డు పెట్టాలని డిమాండ్ చేశారు. నేషనల్ హైవే స్థలం ఆక్రమంచి ప్రైవేటు రైతుబజార్ పెట్టి దందా చేస్తున్నాడని, కూరగాయలకు కిలో రూ.4 చొప్పున అదనపు రేటు వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. కంకిపాడు రైతుబజార్‌లో రైతులను తొలగించి దళారులకు రైతుబజార్ అప్పగించారని చెప్పారు. ప్రభుత్వానికి దుమ్ము ధైర్యం ఉంటే బోడె ప్రసాద్ అవినీతి పై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. బోడెప్రసాద్ మహిళల గౌరవం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని, గుగూల్‌లో కాల్‌మనీ సెక్స్ రాకెట్ గురించి సెర్చ్ చేస్తే ఎవరిపేరు వస్తుందో అందరికి తెలుస్తుందన్నారు. బోడె ప్రసాద్ అక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరావు, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు మండూరు కోటేశ్వరరావు, మండల బీసీసెల్ అధ్యక్షుడు మల్లంపల్లి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవభక్తుని చక్రవర్తి

ఉప్పాల హారికపై దాడి అమానుషం

గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి

గన్నవరం:జిల్లా పరిషత్ ఛైర్మన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గుండాలు దాడికి పాల్పడడం అమానుషమని గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో భారత రాజ్యాంగానికి బదులుగా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. బీసీ మహిళ, జిల్లా ప్రథమ పౌరురాలైన జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక కారుపై టీడీపీ, జనసేన మూకాలు దాడిచేయడం దారుణమన్నారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా హారికపై దూషణలకు పాల్పడడం అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఇదంతా పోలీసుల సమక్షంలోనే జరగడం కూటమి ప్రభుత్వ దుర్మార్గపు పాలనకు నిదర్శనమన్నారు. అసలు ఈ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలను సమాజంలో ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు. పోలీసులు ఇప్పటికైనా హారికపై దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

హారికపై దాడి ఖండిస్తున్నాం...

రామవరప్పాడు: జెడ్పీ చైర్ పర్సన్ బీసీ మహిళ ఉప్పాల హారికపై దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ గౌడ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాదు శివరామకృష్ణ అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సభకు వెళ్తుతుండగా గుడివాడ సమీపంలో టీడీపీ, జనసేన శ్రేణులు వాహనం అడ్డగించి దాడికి తెగపడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతుందని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్ బుక్ పరిపాలనను అమలు చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, జిల్లా ప్రథమ పౌరురాలైన హారికపై దాడి చేయడం రెడ్ బుక్ పాలనకు నిదర్శనమన్నారు. పోలీసుల సాక్షిగా జరిగిన ఈ ఉన్మాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.



హారికను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు

ఉన్మాదుల దాడి ....

హనుమాన్‌జంక్షన్ రూరల్:అధికార మదంతో బీసీ వర్గానికి చెందిన మహిళా ప్రజాప్రతినిధిపై కూటమి ఉన్మాదులు దాడికి పాల్పడటం అత్యంత హేయనీయమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కైలే జ్ఞానమణి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలోని ఆమె స్వగృహంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికపై గుడివాడలో టీడీపీ, జనసేన శ్రేణులు దాడి చేయటాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా ఓ బీసీ మహిళా ప్రజా ప్రతినిధిపై దుర్భాషలాడుతూ కర్రలు, రాళ్లతో దాడి చేయటం, కారును ధ్వంసం చేయటం సిగ్గుచేటన్నారు. బీసీ మహిళ హారిక కన్నీళ్లు ఈ కూటమి ప్రభుత్వం పాలిట శాపంగా మారతాయని తెలిపారు. ఈ దుశ్చర్యలను గమనిస్తున్న రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పటం ఖాయమన్నారు.

బీసీ మహిళపై దాడి దారుణం...

కంకిపాడు: బీసీ మహిళ, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన మూకలు దాడి చేయటం అత్యంత దారుణమని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. ఉప్పాల హారికను ఆదివారం ఆమె నివాసంలో బాకీ బాబు, ఇతర నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా బాకీ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి మహిళలంటే గౌరవం లేదన్నారు. దాడులే పరమావధిగా వ్యవహరిస్తున్నాయన్నారు. హారికను అంతమొందించేందుకు కుట్ర పన్నారనే అనుమానాలు దాడి అనంతరం వ్యక్తమవుతున్నాయన్నారు. దాడికి పాల్పడ్డ అల్లరి మూకలను అరెస్టు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నున్నలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కొద్దిపాటి వర్షం కురిసినా ఆర్ అండ్‌బీ రోడ్డు వెంబడి వర్షం నీరు పరుగులు పెడుతుంది. భారీ వర్షం కురిస్తే నీరు రోడ్డెక్కి పారుతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. విజయవాడ నగరానికి ఆనుకొని ఉన్న గ్రామాల్లో రోడ్డు వెంబడి డ్రెయినేజీ వ్యవస్థ లేనిది నున్న గ్రామం ఒక్కటేనని పేర్కొనవచ్చు. ఎడతెరపి లేకుండా వర్షాలు కురిస్తే కొండల పైన కురిసిన వర్షానికి వాగుల్లో పొంగి ప్రవహిస్తూ పంట పొలాలపై పడటం ఆ నీరు మరింత ఉధృతంగా రోడ్డు పై ప్రవహించి పవర్ గ్రిడ్ సంస్థ ఎదురుగా రోజుల తరబడి రోడ్డుపై నిలబడి ఉంటున్నాయి. దీని వలన పరిసర ప్రాంతాల ప్రజలకు దోమల బెడద ఏర్పడి నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు నిర్మించాలని గ్రామస్తులు పంచాయతీ అధికారులు, పాలకులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయింది. గ్రామ పంచాయతీ నుంచి ఆర్‌అండ్‌బీశాఖకు అనేక దఫాలు లెటర్లు పెట్టినా, గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి పంపినా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. నగరంలో అద్దెలు భారం అధికంగా ఉండటంతో పరిసర ప్రాంతాల్లో ఉద్యోగం చేసుకొనే వారు నున్నలోనే నివాసం ఉంటున్నారు. ఖాళీ స్థలాలు ఎక్కడ కనిపిస్తే అక్కడ ఆక్రమించుకోవడం, అవసరమైతే గల్లీనాయకుల అండదండలతో షాపులు నిర్మిస్తున్నారు. పర్యవసానంగా ట్రాఫిక్ సమస్య అధికమై రోజూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు ఆక్రమణలు తొలగించి సెంట్రల్ డివైడర్ నిర్మించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- పెనమలూరు:వణుకూరు గ్రామ మాజీ సర్పంచ్ రావి వెంకట నారాయణరావు(93) ఆదివారం మృతి చెందారు. ఆయన 1970–1978 కాలంలో గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. ఆయన భార్య గతంలో మృతి చెందారు. ఆయనకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. వారిలో కూడా ఇద్దరు మరణించారు. ఆయన మరణం పట్ల గ్రామ మాజీ సర్పంచ్, ఎంపీటీసీల సంఘ మాజీ అధ్యక్షుడు కాసరనేని మురళీ ప్రగాఢ సంతాపం తెలిపారు. నారాయణరావు అంత్యక్రియలు మంగళవారం నిర్వహిస్తారు.